నమస్తే తెలంగాణ
# మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, సోమవారం 5 ఆగస్టు 2024 MAHABUBNAGAR NARAYANPET



కొండపై రాములోరి దర్శనానికి బారులుదీరిన భక్తులు

# 'కొండ'ంత జనం

మహబూబ్‌నగర్, ఆగస్టు 4 : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలకేంద్రంలోని శ్రీరామకొండకు ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కొండపై ఉన్న శ్రీరాముడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం కొండపై ఉన్న గుండంలోని నీటిని, చెట్టు కొమ్మలను ఇండ్లకు తీసుకెళ్లారు. ఆ చెట్టు కొమ్మలను ఇంటో పెట్టుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. శ్రీరామకొండకు భక్తులు వేల సంఖ్యలో తరలిరావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు బందోబస్తు నిర్వహించిన భక్తులను కంట్రోల్ చేయలేకపోయారు.



# శ్రావణం.. శుభప్రదం

- హైందవ సంస్కృతికి నిలువుటద్దం
- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- మాసాంతం విశేషాలెన్నో..
- ప్రతి మంగళవారం మంగళగౌరీ, ప్రతి శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు
- ముస్తాబైన ఆలయాలు

గద్వాల టౌన్, ఆగస్టు 4 : భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో శ్రావణ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది.. అందుకే ఈ మాసాన్ని శుభాల మాసం.. పండుగల మాసం అంటారు.. శ్రావణం అంటేనే ఆధ్మాత్మిక మాసం.. ఈ నెలలో అన్ని రోజులు శుభకరమే.. నాగుల పంచమి మొదలు వరలక్ష్మీ వ్రతం, రాఖీపౌర్ణమి, హయగ్రీవ జయంతి, కృష్ణాష్టమి, రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు లాంటి ఎంతో విశిష్టమైన పండుగలు ఈ మాసంలోనే రావడంతో ఎంతో విశిష్టత చేకూరింది.. ముఖ్యంగా మహిళలకు ఎంతో ప్రత్యేకమైంది ఈ మాసం.. ఈ మాసాంతం ప్రతి ఇల్లు నిత్యపూజలతో అలరారుతుంది.. ఆలయాలన్నీ భక్తులో కిక్కిరిసి పోతాయి.. ప్రతి ఆలయం పూజలు, అభిషేకాలతో అలరారుతాయి. శ్రవణ నక్షత్రం ప్రవేశంతో వచ్చేదే శ్రావణ మాసం. ముక్కంటికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం ఇది. అలాగే శ్రీనివాసుని జన్మ నక్షత్రం కూడా శ్రావణమే.. శ్రీకృష్ణుడు అవతరించింది శ్రావణమాసంలోనే.. బలిచక్రవర్తికి పట్టాభిషేకం జరిగిన మాసం.. భక్తిమార్గాల్లో శ్రవణభక్తి మొదటిది.. శ్రవణ నక్షత్రానికి అధిపతి శివుడు ఈ మాసంలో శ్రీమహావిష్ణువుని పూజిస్తాడని ప్రతీతి. అందుకే శ్రావణ మాసానికి ఇంతటి ప్రత్యేకత సంతరించుకుంది. శ్రావణ మాసంలో వచ్చే ప్రతిరోజు ఎంతో విశిష్టత ఉంది. ఎందుకంటే ఈ మాసాంతం శ్రవణ నక్షత్రం ఉండటమే కారణమని పండితులు చెప్తున్నారు. మాసాంతం స్వామిని, అమ్మవారిని కొలిస్తే సకల పాపాలు తొలుగుతాయని పండితులు చెబుతున్నారు. శ్రావణ మాసం వర్షరుతువుతోపాటు పండుగలను తీసుకొస్తుంది.

ఈ మాసంలో వచ్చినన్ని పండుగలు ఏ మాసంలో రావు. అందుకే ఈ మాసాన్ని పండుగల మాసం అని కూడా అంటారు.

### నాగుల పంచమి..

శ్రావణ శుద్ధ, చవితి, పంచమి రోజున నాగులచవితి, పంచమిని జరుపుకొంటారు. ఈ రెండు రోజులతోపాటు, శ్రావణ మాసంలో వచ్చే శనివారాల్లో పెద్దలు, పిల్లలు పుట్టల్లో పాలు పోసి భక్తిశ్రద్ధలతో నమస్కరిస్తారు. నాగముద్రికలను సమర్పించుకుంటారు. ఇలా చేస్తే సర్వదోషాలు, సర్పదోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

### శ్రావణ పూర్ణిమ..

శ్రావణ మాసంలో వచ్చే పూర్ణిమనే శ్రావణ పూర్ణిమ అంటారు. అలాగే రక్షా బంధన్, జంద్యాల పౌర్ణమిగా జరుపుకొంటారు. అలాగే ఇదే రోజున సంతోషిమాత జయంతి కావడం ఎంతో విశిష్టత చేకూరింది. మాతను ఆరాధించడం ద్వారా సకల పాపాలు తొలగి శుభాలు కలుగుతాయన్నది హిందువుల నమ్మకం.

### శ్రీకృష్ణాష్టమి..

శ్రావణ కృష్ణపక్ష అష్టమి రోజును శ్రీకృష్టుడి జన్మాష్టమిగా జరుపుకొంటారు. ఒక్క కృష్ణాష్టమి వ్రతాన్ని నిష్టతో ఆచరిస్తే సంవత్సరంలో 24ఏకాదశి వ్రతాలు చేసిన పుణ్యఫలం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ రోజున ప్రతి పల్లె, ప్రతి పట్టణం ఉట్టి సంబురాలు జరుపుకొంటారు. చిన్నారులను గోపికలుగా, కృష్ణులుగా అలంకరించి మురిసిపోతారు.

### ఆలయాలకు శ్రావణ శోభ..

శ్రావణమాసంలో ఆలయాలన్నీ నూతన శోభను సంతరించుకోనున్నాయి. జిల్లా కేంద్రం గద్వాలలోని ఆలయాలతోపాటు వివిధ మండలాల్లోని ప్రధాన ఆలయాలన్నింటినీ శోభాయమానంగా అలంకరించనున్నారు. నిత్యాభిషేకాలతో, నిత్యపూజలతో ఆలయాలు అలరాలనున్నాయి. కోటలోని భూలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, మార్కండేయస్వామి, కన్యకాపరమేశ్వరి, అంబాభవాని, భద్రకాళి, అన్నపూర్ణేశ్వరి, పాండురంగస్వామి, వేంకటేశ్వరస్వామి, నదీ అగ్రహారం స్పటికలింగ్వేరస్వామి, లక్ష్మీనృసింహా



కాళికాదేవికి సారెను సమర్పించిన భక్తులు

స్వామి, ఉత్తరముఖ ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు, అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

### మంగళగౌరీ వ్రతం..

శ్రావణమాసంలో వచ్చే మంగళవారాలు, శుక్రవారాల్లోనూ మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. ముత్తైదువులు, అవివాహిత స్త్రీలు ఆచరించే మంగళగౌరీ వ్రతం అత్యంత విశేషమైంది. అమ్మవారిని షోడశోపచారాలతో, అష్టోత్తోరశత నామాలతో పూజిస్తారు. పసుపు, బంగారం, వెండితో గౌరమ్మను పూజిస్తే సుఖ సంపదలు, ధనదాన్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. అలాగే వివాహం కాని వారికి వివాహం అవుతుందన్నది ప్రగాఢ విశ్వాసం. చివరి వారంలో పసుపు, కుంకుమలతో వాయినాలు సమర్పించుకుంటారు.

### వరలక్ష్మీ వ్రతం..

నిత్య సౌభాగ్యం కోసం మహిళలు ఆచరించే వ్రతాల్లో శ్రీవరలక్ష్మీ వ్రతం ఒకటి. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ రోజున ప్రత్యేకంగా అమ్మవారికి కుంకుమార్చనలు చేస్తారు. అష్టైశ్వార్యాలు ప్రసాదించాలని, సౌభాగ్యాలతో వర్థిల్లేలా చూడాలని అమ్మవారిని కోరుకుంటారు.

### శ్రావణ శుక్రవారం..

శ్రావణ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారం ఎంతో ప్రాధాన్యమైంది. ఈ రోజున అమ్మవారి కరుణా కటాక్షాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. వరలక్ష్మీ వ్రతం ఆచరించే వారికి శుక్రవారం ఎంతో శుభప్రదమైంది. ఈ రోజున అమ్మవారికి కుంకుమార్చనలు, ఎర్రని పూలు, అల్లిన మల్లెల మాలను సమర్పిస్తే సకల పాపాలు తొలుగుతాయన్నది, అలాగే రుణ విముక్తి, లక్ష్మీకటాక్షం, సౌభాగ్యం సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

# పర్యాటకంగా పాలమూరు అభివృద్ధి



సరళాసాగర్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు

- కోయిల్‌సాగర్, సరళాసాగర్, కురుమూర్తికి రూ.3కోట్లు
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపలి కృష్ణారావు
- ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలతో స్టడీ టూర్

దేవరకద్ర/దేవరకద్ర రూరల్/కొత్తకోట, ఆగస్టు 4 : తెలంగాణలో ప్రపంచస్థాయి పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయని వాటిని జాతీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపలి కృష్ణారావు తెలిపారు. ఆదివారం పర్యాటక స్టడీ టూర్‌లో భాగంగా మండలంలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టును ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నాగరకర్నూల్ ఎంపీ మల్లు రవితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలు, చారిత్రాత్మక కట్టడాలు అనేకంగా ఉన్నాయన్నారు. కోయిల్‌సాగర్ అంతర్రాష్ట్ర రహదారికి సమీపంలో ఉండడంతో ఈ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తయారు చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతోపాటు ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రాజెక్టు దగ్గర ఏకో పార్కు, బోటింగ్ సిస్టాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు రూ.3కోట్ల నిధులు తక్షణమే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

**కురుమూర్తిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం..**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేదల తిరుపతిగా పిలువబడే కురుమూర్తి క్షేత్రాన్ని సకల సౌకర్యాలతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి స్టడీ టూర్‌లో భాగంగా మంత్రి కురుమూర్తిస్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తారని, అందుకోసం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం మరిన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే భక్తులు బస చేసేందుకు అవసరం మేరకు కాటేజ్‌ల నిర్మాణాలు చేపడుతామన్నారు. అనంతరం వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలో రెండోదైన ఆటోమెటిక్ సైఫన్ సిస్టమ్ గల సరళాసాగర్ ప్రాజెక్టుతోపాటు కోయిల్‌సాగర్ పర్యాటక ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమాల్లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కశిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, గద్వాల మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తదితరులు ఉన్నారు.

# సమస్యలపై నిరసన గళం!

- నేటి నుంచి సామూహిక సెలవుల్లో పంచాయతీ కార్యదర్శులు
- స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంపై నీలినీడలు

గద్వాల, ఆగస్టు 4 : జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలు పరిష్కరించక పోవడాన్ని నిరసిస్తూ నేటి నుంచి సామూహిక సెలవులపై వెళ్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు శనివారం పంచాయతీ కార్యదర్శులు సెలవుల్లో వెళ్తున్నట్లు ప్రత్యేకాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో ఈ ప్రభావం నేటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ఐదు రోజులపాటు నిర్వహించే స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమంపై ప్రభావం పడే అవకాశం ఉన్నది. ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలు ఐదురోజుల పాటు నిర్వహించాలని అందుకోసం కమిటీల ఏర్పాటుతోపాటు ఈ కార్యక్రమానికి ప్రత్యేకాధికారులను నియమించింది. అయితే గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టే బాధ్యత పంచాయతీ కార్యదర్శులతోపాటు ప్రత్యేక అధికారులకు ఇచ్చింది. ప్రస్తుతం జిల్లాలో పెద్ద గ్రామ పంచాయతీలు మినహాయిస్తే ఏ గ్రామ పంచాయతీల్లో నిధులు లేవని అలాంటప్పుడు గ్రామాల్లో ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాలు ఎలా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

**నేటినుంచి సామూహిక సెలవులకు సిద్ధం**

జిల్లాలో 255 పంచాయతీలు ఉండగా నేటి నుంచి 232 గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులపై వెళ్తున్నట్లు ప్రత్యేక అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. గ్రామ కార్యదర్శులు సామూహిక సెలవులపై వెళ్లడానికి కారణాలు పరిశీలిస్తే 3మార్చి 2024న జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి కౌన్సెలింగ్ నిర్వహించకుండా, ఎటువంటి కారణాలు లేకుండా ఓ అధికార పార్టీ నేత ఆదేశాలతో జిల్లా అధికారి గ్రామ కార్యదర్శులను వారికి ఎటువంటి సమాచారం లేకుండా వారు పని చేస్తున్న ప్రాంతాల నుంచి సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న బదిలీల్లో వారికి అవకాశం లేకుండా పోయింది. గ్రామ కార్యదర్శులను ఇష్టా రీతిలో బదిలీల విషయమై జూలై 18న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి జూలై 21వ తేదీలోపు కార్యదర్శుల బదిలీలు చేపట్టాలని లేకపోతే జూలై 22 నుంచి సామూహిక సెలవులపై వెళ్తామని జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. అయినా అధికారులు బదిలీలు చేపట్టక పోవడంతో దీన్ని నిరసిస్తూ నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులందరూ సామూహిక సెలవులపై వెళ్తామని శనివారం మరోసారి ప్రత్యేకాధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతో నేటి నుంచి జరిగే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో అధికారులు బదిలీ చేస్తారా లేక బుజ్జగించి కార్యక్రమంలో పాల్గొనేలా చేస్తారో వేచి చూడాల్సిందే.

# పెంట్లవెల్లి కేజీబీవీలో ఫుడ్‌పాయిజన్

- 18 మంది విద్యార్థినులకు అస్వస్థత
- మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శ



విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి, ఆగస్టు 4 : పెంట్లవెల్లికి సమీపంలో ఉన్న కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ కావడంతో 18మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. కేజీబీవీలో గత కొద్దిరోజుల నుంచి భోజనం సరిగా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నా.. అడపాదడపా అస్వస్థతకు గురవుతున్నా ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా పాఠశాల సిబ్బంది గోప్యంగా ఉంచారు. కొంతమంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కేజీబీవీ సిబ్బంది వారికి ఏవో టాబ్లెట్లు ఇచ్చారు. విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో పరిస్థి తి కాస్త విషమించిందని గుర్తించి వెం టనే వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. వైద్య సిబ్బంది అక్కడికి వచ్చి 18 మంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆ సమయంలో కొంత మంది విద్యార్థినులు రోధిస్తూ అంబులెన్స్ ఎక్కడం స్థానికంగా ఉన్నవారిని కంటతడి పెట్టించింది. ఈ తతంగం అంతా స్టేట్ కోర్డినేటర్ శిరిష ఎదుట జరగడం విశేషం. అయితే ఆదివారం మధ్యాహ్నం జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ఎవరికీ తెలియకుండా పాఠశాలకొచ్చి పరిశీలించి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.


**మెరుగైన వైద్యం అందించాలి : మంత్రి**

విద్యార్థినుల అస్వస్థత విషయం తెలుసుకున్న ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దవాఖానకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

# సోమశిల సోయగం



సోమశిల పుష్కరఘాట్ వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు




బోటులో విహరిస్తున్న పర్యాటకులు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల ప్రకృతి సోయగాలతో సరికొత్త అందాలను సంతరించుకున్నది. కృష్ణమ్మ పరవళ్లు.. పచ్చని కొండలతో ఆహ్లాదకర వాతావరణం నెలకొన్నది. దీంతో సోమశిలకు పర్యాటక తాకిడి పెరిగింది.
– కొల్లాపూర్, ఆగస్టు 4

# కష్టమంతా నీటిపాలాయే

- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ధరూరు, ఆగస్టు 4 : కృష్ణానదికి వరద పోటెత్తడంతో జూరాల ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తున్నది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తుండడంతో దిగువన ఉన్న పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. ధరూర్ మండలంలోని భీంపురానికి చెందిన మాజీ సర్పంచ్ రామాంజనేయులుతోపాటు రేకులపల్లి చెందిన రైతులు పొలాల్లో వరినాట్లు వేయగా కృష్ణానది వరదల్లో నీటి మునిగిపోయాయి. దీంతో అధికారులు తమను ఆదుకోవాలని ప్రాజెక్టు అధికారులు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించినా పట్టించుకోకపోవడంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ పంటపొలాల్లో వినతిపత్రాలు పట్టుకొని రైతులు నిరసన వ్యక్తం చేశారు.



రేకులపల్లి శివారులో కృష్ణానది నీటిలో మునిగిన పంట పొలాల్లో రైతులు

# ప్రకృతితో మమేకం.. తీజ్ ఉత్సవం

- శ్రావణమాసంలో వేడుకలు ప్రారంభం
- 9రోజులపాటు ప్రత్యేక ఉపవాసాలు
- గిరిజన తండాలు, గ్రామాల్లో నెలకొన్న సందడి
- మట్టిని, మొలకలను పూజించే గిరిపుత్రుల పండుగ



బుట్టల్లో మొలకెత్తిన మొలకలు

అచ్చంపేట, ఆగస్టు 4 : బంజారాల సంప్రదాయాలు, పండుగలు ప్రత్యేకంగా ఉంటాయి. ప్రతి యేటా శ్రావణమాసంలో తీజ్ వేడుకలను నిర్వహిస్తారు. శ్రావణమాసంలో వచ్చే మొదటి సోమవారం తీజ్ పండుగ వేడుకలు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. తీజ్ వేడుకలు బ తుకమ్మను పోలి ఉంటుంది. ప్రధానంగా భక్తిభావంతో పెళ్లికాని యువతులు తొమ్మిది రోజులపాటు జరుపుకొంటారు. ప్రకృతితో మమేకమై మట్టిని, మొలకలను ఆరాధిస్తారు. ఈ పండుగను పూర్వకాలం నుంచి నిర్వహించుకోవడం ఆనవాయితీ. బంజార మహిళలు, యువతుల ఆటపాట లు, నృత్యాలు, డప్పులదరువు మధ్య భక్తిభావంతో 9రోజులపాటు ప్రత్యేక ఉపవాసాలు ఉండి ఉత్సవాలు నిర్వహిస్తారు.

**ప్రత్యేక కార్యక్రమాలు..**

తొమ్మిదిరోజుల పాటు రోజుకో పూజా కార్యక్రమం నిర్వహిస్తారు. నానబెట్టిన శనగలను రేగుముళ్లను గుచ్చే ఒక విలక్షణమైన ఆచారాన్ని బోరడిరుఘ్మే రో పేరుతో పిలుస్తారు. గోధుమలను బుట్టలో చల్లేరోజు సాయంత్రం నిర్వహిస్తారు. పెళ్లికాని ఆడపిల్లలు రేగుముళ్లకు శనగలు గుచ్చుతుంటే తమకు బావవరుస అయినవారు ముళ్లను కదిలిస్తారు. అయినా అమ్మాయిలు సహనంతో శనగలను ముళ్లకు గుచ్చాల్సి ఉంటుంది. చెల్లెలిని ఏడిపించేందుకు అన్నలు కూడా పాల్గొంటారు. బిందెల్లో నీళ్లను తెచ్చి బుట్లకు పోసేటప్పుడు సేవాలాల్ పాటలతో స్మరిస్తారు. తీజ్ ఎంత ఏపుగా, పచ్చగా పెరిగితే తమకు నచ్చిన జీవిత భాగస్వామి వస్తారని, తమ బతుకులు పచ్చగా ఉండి, తండా బాగుపడుతుందని విశ్వసిస్తారు. ఏడో రోజు ఢమోళి చుర్మో (రొట్టెలు, బెల్లం కలిపిన ముద్ద)ను మేరామ అమ్మవారికి సమర్పిస్తారు. ఎనిమిదో రోజు బంజారాల ఆరాధ్య దేవతల ప్రతిరూపాలను మట్టితో చేసి పూజిస్తారు. వారికి పెళ్లి చేస్తారు. ఆడపిల్లలు తమను డోక్రీలుగా ఊహించుకుంటారు. పెళ్లయితే తాము పుట్టింటిని వదిలి వెళ్లాల్సి వస్తుందని ఏడుస్తారు. వారిని సోదరులు ఓదార్చుతూ, బావలు ఆటపట్టిస్తారు. కొంత దు:ఖం, ఆనందంతో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. తొమ్మిది రోజుల పాటు ఉపవాస దీక్షలు ఉంటూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మొలకలకు నీళ్లు పోస్తూ పూజలు చేస్తారు. చివరి రోజు నిమజ్జనం కనులపండువగా నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల్లో ఉండే తమ బంధువులను ఆహ్వానిస్తారు. చదువులు, ఉద్యోగాలరీత్యా పట్టణాలు, నగరాల్లో స్థిరపడిన వారు తండాలకు చేరుకుంటారు. మొలకల బుట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యువతులు తీజ్‌ను తలపై పెట్టుకొని డప్పుచప్పుళ్లతో సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలిస్తారు. అనంతరం చెరువుల్లో తీజ్‌ను నిమజ్జనం చేస్తారు. తొమ్మిదిరోజుల పాటు భక్తిశ్రద్ధలతో తీజ్‌ను పూజించిన యువతులు చెరువు వద్ద నిమజ్జనం చేసేటప్పుడు ఏడుస్తారు. సోదరులు యువతుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు. పండుగ నియమ నిష్టలతో సాగుతుంది. శ్రావణమాసం ప్రారంభం నుంచి ముగిసేవరకు తండాలు, గ్రామాల్లో తీజ్ పండుగ సందడి ఉంటుంది.

## పండుగ సందడి..

తీజ్ ఉత్సవాలప్రారంభానికి ముందు యువతులు పెద్దవాళ్ల ఆశీర్వాదాలు తీసుకుంటారు. ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరిస్తారు. అంగడికి వెళ్లి గోధుమలు, శనగలు తెచ్చుకుంటారు. గోధుమలను నానబెట్టి మొలకెత్తించేందుకు బుట్టలను అల్లుతారు. ఒక్కో ఆడపిల్ల ఒక్కో బుట్టని తయారు చేస్తారు. ఆ బుట్టలన్నీ ఒకేచోట ఉంచేందుకు పందిరిని ఏర్పాటు చేస్తారు. పుట్టమట్టిని తెచ్చి అందులో పశువుల ఎరువును కలుపుతారు. బంజారాల ఆరాధ్యదైవమైన మేరామ అమ్మవారు, సేవాలాల్ మహారాజ్, సీత్లాభవాని పేర్లతో తయారు చేసిన బుట్టల్లో మొదటగా తండాపెద్దల చేత ఎరువు కలిపిన మట్టిని బుట్టలలో పోయిస్తారు. గోధుమలను నానబెట్టే విధానాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. నానబెట్టిన గోధుమలను మట్టికలిపిన బుట్లలో చల్లుతారు. అయితే ప్రతి కార్యక్రమం బంజార సంప్రదాయ ఆటపాటలతో సాగుతోంది. గోధుమ మొలకలను తీజ్‌గా పిలుస్తారు. ఈ గోధుమ మొలకలను పూజిస్తారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం బుట్టలలో నీళ్లుపొస్తారు. మొక్కలు ఎంతబాగా మొలకెత్తితే అంతమంచి జరుగుతుందని తండా పెద్దలు నమ్మకం. ఈ తొమ్మిదిరోజులపాటు యువతులు ప్రత్యేక ఉపవాసాలతో గడుపుతారు. ఉప్పుకారం లేని భోజనం చేస్తారు. అయితే ఈ పూజలు చేసేవారు తండానుంచి బయటకు వెళ్లకూడదు. మాంసాహారాలు తీసుకోకూడదు. బావి, చేతిపంపు నుంచి తెచ్చిన నీటిబిందెను ఎక్కడా నేలపై పెట్టకూడదు. నృత్యాలు చేసినంతసేపు బిందెను నెత్తిపై పెట్టుకొని నిలబడతారు. తర్వాత మొలకలకు పోస్తారు.